దొంగలున్నారు! జాగ్రత్త!

★

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

రైలుబండి అర్థరాత్రి కారుచీకటిలోంచి, కారడవిలోంచి వెళుతూంది. శేషయ్యగారు ప్రయాణం చేస్తున్న ఇంటరు క్లాసు పెట్టె చాల చిన్నది. పెట్టెలో రెండో మనిషి లేడు. మీదనున్న రెండు లైట్లలోనూ ఒకటి వెలగడంలేదు. రెండవది కూడా కాంతివంతంగా లేదు. కిటికీలన్నీ వేసి శేషయ్యగారు బెంచీమీద నడుం వాల్చేరు.

ఎదురుగుండా గోడమీద "దొంగలున్నారు జాగ్రత్త!" అని చదివేరు. ఆయన గుండె దడదడ కొట్టుకుంది. ఎవరేనా దొంగలున్నారేమో అని చుట్టూ ఒకసారి చూసి మళ్ళీ ధైర్యం తెచ్చుకున్నారు. రైలువాళ్లకీ సరిగా తెలుగుభాష రాదు. "దొంగలున్నారు జాగ్రత్త" అని వ్రాసుకుంటారా, ఎవరేనా? "దొంగలుంటారు" లేదా "దొంగ లుండగలరు" అని వ్రాసుకోవాలిగాని. శేషయ్యగారు తనలో తనే నవ్వుకున్నారు.

ఈసారి తను వచ్చినపని జయప్రదమైంది. కలపకొనడంలో గొప్ప వ్యవహారజ్ఞానం వుపయోగించి బేరంలో రెండువేల రూపాయలు మిగిల్చేరు. రాయిపూరు వెళ్ళి యీ సంగతి తన భార్యతో చెబితే ఎంతో సంతోషిస్తుంది. అవును మరి, దానికోసం, దాని పిల్లలకోసమేకదా యీ ఆర్జన అంతాను.

గాలి వూపుకి కిటికీ అద్దం "టఫీ"మని పడిపోయింది. పరధ్యాన్నంగావున్న శేషయ్యగారు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. లేచి కూర్చుని కిటికీలోంచి చీకట్లోకి చూసి మళ్లీ కిటికీ మూసివేశారు. తన వొంటరితనం స్ఫురణకు రాగానే ఆయన కొక్కసారి భయం వేసింది. తన మొలలో రెండువేలరూపాయ లున్నాయి. ఇప్పుడెవడేనావచ్చి యీ డబ్బుకోసం తన్నిక్కడ చంపితే తన పెళ్లాం పిల్లల గతేమవుతుంది? ఆయన గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

అయితే దొంగకు తనవద్ద రెండువేలున్నాయని ఎలా తెలుస్తుంది? రెండువేలేమిటి? యింకా ఎక్కువే వుండవచ్చునని వాడు అనుమానించడానికి అవకాశాలున్నాయి. తన జరీకండువా, చేతికి బంగారు వాచీగొలుసు, వేళ్లకు జిగజిగమెరిసే వుంగరం—ఇవి వాడి దృష్టి నాకర్షిస్తాయి. ఇవి తనకెంతో ప్రియమైన వస్తువులు; కాని తనకు ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. ఈ వస్తువులకోసం డబ్బుకోసం వాడు తన్ను కత్తితో పొడిచి చంపవచ్చును. ఆయన కండువాతీసి మడతపెట్టి తలగడక్రింద పెట్టేరు; వాచీగొలుసూ, వుంగరాలు చేతి రుమాలులోకట్టి లాల్చీ పక్కజేబులో వేసుకున్నారు.

అయితే దగ్గర డబ్బున్నంతవరకూ దొంగభయం పోదు. "దొంగలున్నారు జాగ్రత్త!" అని ఎదురుగుండా వ్రాసివున్న వాక్యం ఎంత తప్పించుకుందామన్నా కళ్లబడుతూనే వుంది శేషయ్యగారికి. ఆయనకు మళ్ళీ భయంవేసింది. తన కిప్పుడేమిటి దారి? వచ్చేస్టేషనులో పోలీసులకు రిపోర్టుచేస్తే! అబ్బో, వాళ్లెక్కడ! అనవసరంగా భయపడుతున్నావు పొమ్మంటారు. డబ్బుతో, విలువైన వస్తువలతో ప్రయాణం చేస్తున్న ప్రతివాడికీ రక్షణ యివ్వడానికి దేశంలోవున్న పోలీసులు చాలరని తోసిపారేస్తారు. అబ్బే, పోలీసువాళ్ళ సంఖ్య పెంచితేగాని భద్రత లేదు అనుకున్నారు శేషయ్యగారు.

శేషయ్యగారికి నిద్రపట్టడం లేదు. లేచికూర్చుని చుట్ట వెలిగించారు.

రైలుబండి ఒక చిన్న అడివిస్టేషనులో ఆగింది. అబ్బ బయట ఏమి చీకటిగావుందీ అనుకున్నారు శేషయ్యగారు. మళ్ళీ బండి బయలుదేరేసమయంలో పెట్టెతలుపు తోసుకుని లోపలికెవడో వచ్చాడు. బండి కదిలింది.

"ఒరే. దిగుదిగు, యీపెట్టికాదు, ఇది పరుపులపెట్టి. దిగు! పో!" అని కేకలేశారు శేషయ్యగారు.

"అదేటి బాబయ్యా దిగమంటారు, బండికదిలిపోతేను, చావమంటారేటి, మంచోరే!" అని జాపోసుకుంటూ వాడు నేలమీద చతికిలబడ్డాడు.

"ఎవరు నువ్వు?" అని ప్రశ్నించేరు శేషయ్యగారు.

"ఎంకణ్ణి బాబు" అని జవాబిచ్చాడు వెంకడు.

వెంకడుట! వెధవ! జార్జిరాజులా వెంకడంటే లోకమందరికీ తెలిసినట్టు! శేషయ్యగారికి కోపం, చిరాకూ వచ్చాయి. అసలు ఆవెధవ వాలకం చూస్తూంటే టిక్కట్టులేనిరకంలా కనిపించింది.

* ఈ సంవత్సరము ప్రపంచ కథానికల పోటీకి పంపించిన తెలుగు కథ.

తివాసీగుండూ, మొహంమీద కొనీ అంత మచ్చ, నల్లగా జీడి పిక్కలా వున్నాడు. వస్తాదులా మెడలో చిన్న ఆంజనేయుడి బిళ్ళ, జబ్బకి తావేజా కట్టేడు. చిరిగిన బనీనూ, నిక్కరూ కాళ్ళకి చిరిగిన కేట్సుజోళ్లూ వాడూ వొట్టి బికారి వెధవలా కని పిస్తున్నాడు. నేలకూర్చుని బీడీ వెలిగించేడు. ఏం నిర్లక్ష్యం! దొంగవెధవ! అనుకున్నారు శేషయ్యగారు. వీడు నిజంగా దొంగేమోనని ఆయనకు అనుమానం కలిగింది. మరొక స్టేషను వచ్చేవరకూ వాడితో మెల్లిగా మంచిమాటల్తో కాలం గడపాలి. లేకపోతే యిలాంటివెధవలు ఎంతపాపానికైనా వొడిగడతారు అనుకున్నారు శేషయ్యగారు.

వాడు నేలమీద కూర్చుని బీడీలు కాలుస్తూ ఏవో ఆలో చిస్తున్నాడు. తరవాత మెల్లిగా జేబులోంచి డబ్బులుతీసి, లెక్క పెట్టి, మళ్ళీ జేబులో వేసుకున్నాడు. బీడీ చివరివరకూ కాల్చి, కిటికీలోంచి బయటికి పారేసి, 'తుబుక్కున' వుమ్మేడు.

"ఇప్పుడు టైమెంతవుతాదిబాబు" అన్నాడు శేషయ్యగారి వేపు తిరిగి.

ఏవో మహారాచకార్యాలు చక్కబెట్టేవాడిలాగ యీ వెధవ కిప్పుడు టైమెందుకో? నిద్దరోస్తే పడుకోరాదూ, అనుకుని "పది గంటలైందిరా." అన్నారు శేషయ్యగారు పన్నెండుగంట లైందని చెప్పడాని కిష్టంలేక.

వాడేమీ మాట్లాడలేదు. తన పాతకేట్సుజోడు విప్పి, బండెక్కుతూన్నప్పుడు కొత్తగా చిరిగిన చిరుగును పరీక్షించి, మళ్ళీ తొడుక్కుని, బల్లకు చేరబడి, కాళ్ళు చాచుకుని, "సెలియా కనరావా!" అని యీలపాట ఎత్తుకున్నాడు. ఛీ! వొట్టి పోకిరీ వెధవ!

"ఏవూరురా నీది?" అన్నారు శేషయ్యగారు.

"ఇజానగరంబాబు"

"ఎంతవరకు వెళుతున్నావ్?"

"రాయిపూరు"

"ఎందుకూ?"

"అక్కడ పనులు దొరుకుతాయని సెప్పినారు బాబు."

"ఎవరు చెప్పేరు?"

"ఎవరేటి, సాలమందంటారుబాబూ. అయినా ఎల్లినాక ఏదేనా దొరకదేటి?"

"టిక్కెట్టు కొన్నావా?"

"లేదుబాబు, రోజూ రైల్లో తిరిగేవాడికి టిక్కెట్టేటి?"

"రోజూ ఎందుకు తిరుగుతావు? అసలు నువ్వేంపని చేస్తూ వుంటావు?"

"పనేటిబాబు, బిచ్చమెత్తుకుంటాను, అంతే."

"ఏం, రాయిలా వున్నావుగదా, ముష్టెత్తుకోడమేం? కూలి పని చేసుకోరాదూ" అన్నారు శేషయ్యగారు. ఆయనికి ముష్టి వాళ్ళంటే అసహ్యం. కాని అంతమాత్రచేత ఆయనకి ధర్మచింత లేదనడానికి వీలులేదు. ఆయ నప్పుడప్పుడు ఖైరాతీ సంతర్పణ చేయిస్తూ వుంటారు. బ్రేమ సమాజపోషకవర్గంలో సభ్యులు కూడాను. కాని దుక్కలా వున్నవాళ్ళు కూలి చేసుకోవాలని ఆయన వాదన.

"దొరికితే ఎందుకు సేసుకోంబాబూ? దొరికినప్పుడు కూలి సేసుకుంటాం. లేనప్పుడు బిచ్చమెత్తుకుంటాం" అన్నాడు వెంకడు.

"అసలు నువ్వు దుక్కలాగున్నావ్. నీకు ముష్టెవరు వేస్తారు?"

"అదే బాబు గొప్ప సిక్కొచ్చిపడింది. గుడ్డీ కుంటీ కయితే నాలుగు డబ్బులు దొరుకుతాయి. కాని బాబూ నేను మాత్రమేం తక్కువవాణ్ణేటి? అబ్బో! నే నసలే టక్కరిముండాకొడుకుని. నాలిక అంగుట్లోకి బిగబట్టేసి, మూగోడిలాగ ఏసమేసేస్తాను," అని వెంకడు తన ప్రయోజకత్వానికి తనలో తనే మెచ్చుకున్నట్లు చిరునవ్వు నవ్వేడు.

"ఈరోజుల్లో వందుకు నే వాడికంటె దండుకునేవాడి పనే బాగుందిరా. రోజల్లా కూలిపని చేస్తే రూపాయి డబ్బులు దొరకడం కష్టమవుతుంది. ఇలా అయితే కష్టపడకుండా రోజుకి రెండూ మూడూ దొరుకుతాయి. ఏం?"

"అబ్బో, అంతపాటైతే యింకేం! రాజుగారి కోట నాటి దొకటి కట్టించేద్దును. ముష్టెత్తుకుంటేమాత్రం ఏటి దొరుకుతాది బాబయ్యా? ఒకడా, ఇద్దరా? సూడండి బాబూ గుడ్డీ కుంటీఅంతా కలుపుకుని యీబండికి పాతికమందుంటారు ఎదవలు. ఇంతమందిలో ఏటి దొరుకుతాది బాబూ? ఏదో పావలా, అర్ధా...అలాగే...... ఒక్కొక్కపూట అదీ దొరకదు" అన్నాడు వెంకడు అగ్గిపెట్టి కోసం నిక్కరుజేబు వెదుకుతూ.

"అయితే ఏమీ దొరకనప్పుడేమిటి చేస్తావు?"

"ఏదో వొకటి సేస్తాంగాని పస్తుంటామా?"

"అదే, ఏమిటి చేస్తావూ అంట."

"ఏటి బాబు సాలసిత్రం గడుగుతారు. ఏటి సెయ్యాలంట మేటి? ఒక జేబు కొట్టేస్తే సాలదా? నాలుగు రోజులు జలసాగా ఎల్లిపోతాది. సరిగ్గా ఎయ్యాలిగాని బాబూ కొటుకు మించిన యిద్దే లేదనుకోండి" అని చిరునవ్వు నవ్వి, మళ్ళీ బీడీ వెలిగించి, బాగా దమ్ముతీసి, రైలింజనులాగ "గుఫ్, గుఫ్" మని పొగ వదిలాడు వెంకడు.

ఈసారి శేషయ్యగారి అనుమానం నిజమైంది. ఆయన గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఈ వెధవ తన్ను చంపి తన డబ్బు పట్టుకుపోతే యిక్కడ దిక్కేమిటి? ఇదేం కర్మమో గాని పెట్టెలో రెండో మనిషి లేకపోవడమేమిటి? పోనీ ఎవడో రెండో మనిషి వచ్చాడనుకుంటే రాగారాగా దొంగవెధవ రావడమేమిటి? ఇప్పుడేం చెయ్యాలి? అంతగా ప్రాణాలమీదికి వస్తే తన మొల నున్న రెండువేల రూపాయలూ వాడికి సమర్పించి ఒక నమ స్కారంచేసి వూరుకోవాలి! అంతకన్న చెయ్యగలిగిం దేముంది?

ఛీ! అసలు బయలుదేరినప్పుడు ఎవరిమొహం చూశాడో గాని... అవునవును...తను బయలుదేరుతుండగా పిల్లి కాళ్ళలో పడింది. శేషయ్యగారికి పిల్లిమీద కోపమొచ్చింది.

అయితే శేషయ్యగారు గొప్ప తెలివైనవారు. ఆయన తన మనసులో వుండే భయాన్ని కించిత్తుకూడా బయటపెట్టలేదు. మీదు మిక్కిలి వెంకణ్ణి మంచిమాటల్తో లోంగదీసుకుని స్టేషను రాగానే పోలీసువాళ్ళకి అప్పజెప్పవచ్చు ననుకున్నారు.

"అవును, నిజమేనురా వెంకయ్యా, ఏదో పని చెయ్యకపోతే రోజు లెలాగడుస్తాయి చెప్పు? అందుకే పెద్దలు కూటికోసం కోటి విద్యలన్నారు. అయితే, ఒరే, ఎప్పుడేనా పట్టుబడ్డావా?"

వెంకడికి ఆశ్చర్యమేసింది. ఇంతవరకూ తనమీద తన తల్లీ, తను వొదిలేసిన పెళ్ళామూ తప్ప యింకెవ్వరూ సానుభూతి చూపలేదు. ఒకరిద్దరు సహచరులు తప్ప ఎవరూ తన వృత్తిని మెచ్చుకోలేదు. అందులోకీ చదువుకున్న వాళ్ళూ, శుభ్రంగా బట్టలేసుకున్న వాళ్ళూ, కామందులూ తన వృత్తివల్ల తన్నెప్పుడూ అసహ్యించుకుంటారని వాడి నమ్మకం. అటువంటప్పుడు యీాయన తన వృత్తిని సమర్థించడం వెంకడికి ఆశ్చర్యం కలిగించింది.

ఈ దొంగ వెధవ యింతకుముం దెప్పుడూ పట్టుబడకపోతే మొట్టమొదటిసారి తన చేతులమీదుగా పట్టుబడతా డనుకున్నారు శేషయ్యగారు. ఆయన మళ్ళీ అదే ప్రశ్న వేశారు:

"అయితే ఏంరా వెంకయ్యా, యింతకుముందు పెప్పుడేనా దొంగతనంచేసి దొరికిపోయావా?"

"ఎందుకు దొరకలేదుబాబూ, రెండుమూడుసార్లు ఖైదులోక్కూడా ఎళ్లేను."

"అయితే రెండుమూడుసార్లు ఖైదులో కెళ్ళినా దొంగపని మాత్రం వదిలి పెట్టలేదన్నమాట."

"లేదుబాబు, కొడవలికీ చిగ్గనేదు, కొయ్యగూరకీ చిగ్గనేదు"

"బాగానేవుందికానీ, ఒరే వెంకయ్యా యీ వృత్తి చాల ప్రమాదకరమైందిరా. అందులో ప్రాణభయంకూడా వుంది. మాటవరసకి నాదగ్గరికి ఎవడేనా చెడుబుద్ధితో వచ్చాడనుకో, నాదగ్గర ఎప్పుడూ పిస్తోలు రెడీగా వుంటుంది. "ఢన్"మని కాల్చి పారేస్తాను. అంచేత నా మాటవిని యీ వృత్తి వదిలిపెట్టి ఏదేనా పని చేసుకో. పోనీ నీకు రాయిపూరులో పనిప్పిస్తాను నాతోరా. తిండీ, బట్టా, వుండడానికి యిల్లూ కాక రోజుకొక రూపాయి డబ్బులు దొరుకుతాయి. ఏం చేస్తావా" అన్నారు శేషయ్యగారు.

"ఓ, ఎందుకు సెయ్యను బాబూ, అలాగయితే నా నొగ్గేసిన ఆడదాయిని కూడా తీసుకొస్తాను బాబు."

"సరే అయితే" అన్నారు శేషయ్యగారు వెంకడి మొహంలోకి చూస్తూ.

వెంకడి మొహంలో సంతోషం కనిపించింది. వాడు తను వొదిలేసిన పెళ్ళాంగురించి ఆలోచిస్తున్నాడు. నిజంగా నరిసి చాల అమాయకురాలు. తను తిట్టినా, కొట్టినా ఎదురుతిరక్కుండా కుక్కలా పడివుంటుంది. నిజంగా తను ఎన్నిసార్లు దాన్ని చితక్కొదన్నలేదు. అయినా తనంటే పడిచస్తుంది. నరిసికి తనెంతో అన్యాయం చేశాడు. దాన్ని మళ్లీ తీసుకొచ్చి ఒక యిల్లూ సంసారం నడపాలనే కోరికలు వాడిలో వుద్భవించేయి.

ప్రస్తుతానికి వెంకడివల్ల కించిత్తు ప్రమాదంకూడా లేదని శేషయ్యగారికి ధైర్యం కలిగింది. ఆయన మహా మహా ఉద్దండులనే బుట్టలో వేసుకున్నాడు. ఈ వెధవ పీనుగ ఏమాత్రం! లేకపోతే యింత వ్యాపారం వొంటిచేతిమీద ఎలా నడిపిస్తున్నాడు! ఏభైవేల రూపాయల ఆస్తి ఎలా చేశాడు? ఆయనకు యింకొక ఆలోచన తట్టింది. ఈ వెధవను దారిలో దింపేయడంకన్న వీడిని రాయపూరువరకూ రానిచ్చి వీడిచేత సామానులు మోయించి తరవాత సావకాశంగా పోలీసువాళ్ళకు అప్పజెప్పవచ్చును. రాయపూరు స్టేషనులో కూలీలు విపరీతంగా డబ్బు అడుగుతారు. అంతేకాదు, వీడు సామాను పట్టుకుంటే యింటికి నడిచి వెళ్ళిపోవచ్చును. లేకపోతే అనవసరంగా రెండో మూడో దండుగ అనుకున్నారు శేషయ్యగారు.

"ఒరే వెంకయ్యా, రాయిపూరు స్టేషనులో యీ సామాను పట్టుకుని నా వెనకాతల వెళ్ళిపోరా, నా బంట్రోతని చెప్పేస్తానులే. టిక్కెట్టు ఎవడూ అడగడు."

"అలాగేను బాబయ్యా, సామానుకూడా అట్టేలేదు. రెండు పెట్టెలు, పరుపు, యీ సజ్జ అంతేకద బాబు."

"రెండుపెట్టె లేవిరా, ఒకటేకదరా."

"రెండుబాబు, మీద నొకటుంది. ఇదిగో యీ బల్లకింద తోలుపెట్టి వొకటుంది" అన్నాడు వెంకడు.

శేషయ్యగారు ముందుకు వొంగి, తను కూర్చున్న బల్లకింద వున్న తోలుపెట్టెని చూశారు. తోలుపెట్టె సరికొత్తది! నిగనిగ మెరుస్తూంది! రెండు తాళాలు వేసివున్నాయి. ఆయనకి ఆశ్చర్యమేసింది. ఈ పెట్టె తనదికాదు. ఎవరో యీ బల్లకింద మరిచిపోయారు. తనప్పుడే నాలుగైదు గంటలై ప్రయాణం చేస్తున్నాడు; ఎవరూ యీ పెట్టెకోసం రాలేదు. ఆయన బుర్ర ఆలోచనలతో నిండిపోయింది. మెల్లిగా ఆ పెట్టెని ఎత్తిచూశారు. చాల బరువుగావుంది. లోపల ఏమి విలువైన వస్తువులు పెట్టేరో తెలీదు. వెండి సామానులు, నగలు, డబ్బు, ఏమైనా వుండవచ్చును.

"ఏంబాబు అలా సూస్తున్నారు, మీది కాదేటి?"

"నాదేనురా, మరచిపోయాను. మొన్న శనివారంనాడు విశాఖపట్నంలో 48 రూపాయలకు కొన్నానీ తోలుపెట్టె."

"బాగుంది బాబూ, సదువుకున్నోరుగదా, మీ సామాను మీరే మరచిపోతారా?" అని పకపక నవ్వేడు వెంకడు.

శేషయ్యగారికి పెట్టెతీసి అందులో ఏముందో చూడాలనిపించింది. కాని ఎలాగ? తాళాలు విరగ్గొట్టాలి. వీడుంటూండగా ఎలా విరగ్గొట్టడం? దొంగవెధవ బాగా దాపరించేడు శనిలాగ, అనుకున్నారు శేషయ్యగారు. ఆయన మళ్ళీ పెట్టెవేపు చూశారు. ఆహా! కొత్తపెట్టె! పెట్టే చేస్తుంది ఓ యేభై రూపాయలు! ఇంక

పెట్టిలోని వస్తువులెంత విలువైనవో! ఎవరో ధనవంతులు మరచిపోయివుంటారు! అంచేతే అంత నిర్లక్ష్యంగా వూరుకున్నారు. పెట్టె తీసి చూసినా బాగుండును! కాని ఎలాగ?

వెంకడు శేషయ్యగారిని తదేక దీక్షగా పరిశీలిస్తున్నాడు. ఈపెట్టె యీ షావుకారిదే అయితే అతనాపెట్టెవేపు అలా చూస్తాడేం? ఎవడు మరిచిపోయాడో! పెద్ద బట్టలేసుకుని, డాబుగావున్న షావుకారు కాబట్టి ఇది తనదే అంటే ఎవరూ అనుమానించరని వాడి ధైర్యం! నిజమే! ఎవరనుమానిస్తారు? అయితే తనుకూడా దగా పడతాడా? వెంకడు బాగా ఆలోచిస్తున్నాడు.

వెంకడు తనవేపు చూస్తున్నాడని శేషయ్యగారు గ్రహించి, ఏమీ ఎరగనట్టు తలగడా కిందినుంచి దాశరథీ శతకం తీసి పద్యం గట్టిగా ఎత్తుకున్నారు.

బండి ఒక చిన్నస్టేషనులో ఆగింది. ఈ వెధవ నెలాగైనా యిక్కడ దింపేస్తే బాగుండుననుకున్నారు శేషయ్యగారు. అంతట్లో టిక్కెట్టు కలక్టరు తలుపుతోసుకుని లోపలికొచ్చాడు. టిక్కెట్టు కలక్టరు నిద్రమత్తుచేతనో ఏమోగాని కొంచెం తూలుతున్నట్టు కనిపించేడు. కొంచెం కోపంగా వున్నాడు. వెంకణ్ణి చూసి, "ఎవర్రా నువ్వు" అన్నాడు చిరాకుగా.

"మూగి ఎంకణ్ణి బాబూ."

"దిగు వెధవా, నీ బాబుగారి బండిలా ఇంటరులో కూర్చున్నావ్, దిగు" అన్నాడు.

"సిత్తం బాబు" అని వెంకడు బండిదిగి ప్లాట్‌ఫారంమీద నిలబడ్డాడు. శేషయ్యగారు "అమ్మయ్య" అని నిట్టూర్పువిడిచేరు. టిక్కెట్టు కలక్టరు శేషయ్యగారి టిక్కెట్టు పరిశీలించి, తరవాత సామాను చూసేడు. టిక్కెట్టుమీద తీసుకువెళ్లగలిగిన దానికంటె ఎక్కువ బరువువుందని అతను తూకాలూ, లెక్కలూ వేసి నాలుగు రూపాయల ఆరణాలు అదనంగా చార్జీ చేశాడు. శేషయ్యగారు తడుముకోకుండా డబ్బుతీసి యిచ్చారు. ఇంత విలువైన పెట్టె దొరికినప్పుడు యీమాత్రం రైలుచార్జీ యివ్వడంలో నష్టమేముంది? టిక్కెట్టు కలక్టరు దిగివెళ్లగానే బండి కదిలింది. మళ్ళీ తలుపు తోసుకుని వెంకడు లోపలికి వచ్చాడు.

శేషయ్యగారికి వాడిని చూడగానే చిరాకేసింది. వెధవ, ఏలినాటి శనిలాగ పట్టుకు వదలకుండా వున్నాడు.

వెంకడు నేలమీద చతికిలబడి, బీడీ వెలిగించి రెండుదమ్ములు తీసేడు. ఈసారి ఎడ్ల రామదాసు తత్వం మెల్లిగా ఎత్తుకున్నాడు.

"బాబూ, అయితే యిందులో ఏటి పెట్టినారు బాబూ, ఆడు సార్జీ సేసినాడు? కాసింత బరువైతే ముండాకొడుకు లూరుకోరు!" అని వెంకడు శేషయ్యగారి కళ్లలోకి చూశాడు. శేషయ్యగారి కళ్ళలో కొంచెం గాభరా కనిపించింది.

"అబ్బే, ఏమీలేదురా...మాలాంటివాళ్ళ దగ్గర ఏముంటుందోలే?...ఏవో నాలుగు బట్టలూ, ఏదో రామా, కృష్ణా అనుకోడానికి నాలుగు పుస్తకాలూ...ఏముంటుంటాయి చెప్పు?"

"గొప్ప ఇలవైన బట్టలే అయివుంటాయి. అంచేతే అంత బరువు!" అన్నాడు వెంకడు పెంకితనంగా.

"అబ్బే, లేదురా, మామూలుగా కట్టుకునే బట్టలే. అయితే అంత బరువెలా అయిందంటావా? మా బావమరిది వైద్యుడొకడున్నాడులే..."

"ఎక్కడ, యీ పెట్టిలోనా?" అన్నాడు చటుక్కున వెంకడు శేషయ్యగారిమాట పూర్తి కానివ్వకుండా.

"పూర్తిగా చెప్పనియ్యరా మరి! మాట కడ్డొస్తావేమిటి? మా బావమరిది మావూళ్లో వున్నాడు, పెట్టిలో ఎందుకుంటాడు? తెలివి తక్కువ మాటలాడకు విను. వాడు చాల మంచివైద్యుడు. మందులు నూరుకోడానికి రాతికల్వం ఒకటి తెమ్మని వాడు బతిమాలేడు. విశాఖపట్నంలో కొన్నాను. కొంచెం పెద్దదే. అంచేతే వెధవ కల్వం అంత బరువు. కాని ఏంచేస్తాం మరి?" అన్నాడు శేషయ్యగారు. తన సమయస్ఫూర్తికి తనలో తను సంతోషించారు.

వెంకడు "హీ, హీ, హీ!" అని నవ్వేడు. "రాతికల్వం అంత మంచిపెట్టిలో బంగారంనాగ ఎట్టినారు బాబూ" అంటూ వెంకడు మరో బీడీ అంటించాడు.

శేషయ్యగారు ముఖం చిట్లించి, సీరియస్‌గా దాశరథీ శతకం మళ్ళీ తీశారు. కాని మనసులో ఏదో భయం పీక్కుతింటూంది. తను నిష్కారణంగా యీ చిక్కులో పడ్డాడు. ఇందాక టిక్కెట్టు కలక్టరు వచ్చినప్పుడు వెంకడి గురించి చెప్పి పోలీసుల కప్పజెప్పవలసింది. చాల పొరబాటయింది. ఆయన కిప్పుడు వెంకణ్ణిచూస్తే భయం వేస్తూంది. ఈ దొంగవెధవ తన సంగతి కనిపెట్టినట్టుంది! ఏమిటి దారి?

వెంకడికి సర్వమూ అర్థమైంది. ఇంత అనుభవమున్న తన కళ్లలోనే దుమ్ముకొట్టేడు యీ షాహుకారు. అబ్బో! మంచి ఘనమైన దొంగలాగే వున్నాడే అనుకున్నాడు వెంకడు. అయితే పాపం యీ షాహుకారికి అనుభవంలేక యింతసేపూ మాటల్లో అలా పట్టీలు కొట్టేడు అనుకుని తనలో తను నవ్వుకున్నాడు వెంకడు.

తన్నింతసేపూ మోసంచేసినందుకు వాడికి శేషయ్యగారిమీద కోపం వచ్చింది. ఇంకో స్టేషను రాకముందే తనాపెట్టి పట్టుకుని బండి దిగిపోవాలి! అందులో ఎంత డబ్బుందో! నగలో, ఖరీదైన వస్తువులో ఏమిటున్నాయో, యీ షాహుకారి కెందుకు వదిలిపెట్టాలి? చేతికి చిక్కింది చూస్తూ చూస్తూ ఎందుకు జారవిడుచుకోవాలి?

వెంకడు లేచి నిలబడి, మొలలోని కత్తితీసి, శేషయ్యగారి గుండెలమీద పెట్టేడు.

శేషయ్యగారు త్రుళ్ళిపడ్డారు. "అమ్మ బాబోయ్! దొంగ, దొంగ!" అని కేక వేశారు.

"ఇదిగో సెబుతున్నా ఇనుకో. కేకేసినా, లెగిసినా పొడిసేస్తాను తెలిసిందా. నాతోటి ఏసాలు మానీ. మూగెంకడి తడాఖా నీకేటి తెలుసు!"

"ఒరే నాయనా, చంపకురా, నీ పుణ్యముంటుందిరా, నీ కేమిటి కావాలో పట్టుకుపోరా బాబూ. పిల్లలవాణ్ణిరా," అని మొరపెట్టేరు శేషయ్యగారు. ఆయన భయంతో గజగజ వణుకుతున్నారు.

"నిన్ను సంపకపోతే నువ్వు నన్నొగ్గేస్తావేటి? పిస్తోలేసి కాల్చేస్తావు."

"లేదురా నాయనా, నాదగ్గర పిస్తోలు లేదురా. ఒట్టినే సరదా కన్నానురా, చంపకురా" అని ఆయన ప్రాధేయపడుతూంటే వెంకడు రెండోచేత్తో బెడ్డింగు తాడు లాగి ఆయన రెండు చేతులూ కట్టేశాడు. ఇంకాయన పిస్తోలు పేల్చడం అసాధ్యం. ఎందుకేనా మంచిది, ఎక్కడేనా పిస్తోలుందేమోనని వెదికాడు వెంకడు. కాని ఎక్కడా లేదు.

"ఇదిగో ఎవరితోనేనా సెప్పినావంటే సమ్మారుకుంటావ్ తెలిసిందా?" అంటూ వెంకడు, బల్లకింద తోలుపెట్టితీసి చేత్తో పట్టుకుని తలుపుదగ్గర నిలబడ్డాడు.

ఏదో స్టేషను సమీపిస్తోంది కాబోలు బండివేగం తగ్గింది. ఒక చేత్తో తోలుపెట్టి పట్టుకుని మరో చేత్తో తలుపుతీసి గుమ్మం దగ్గర నిలబడి దిగిపోడానికి వెంకడు సమయంకోసం చూస్తున్నాడు.

శేషయ్యగారు మెల్లిగా లేచి నిలబడి బండి గొలుసు లాగి, మళ్ళీ యథాప్రకారం పడుకున్నారు. గుమ్మం దగ్గర నిలబడి చీకట్లోకి చూస్తూన్న వెంకడు ఇది గమనించలేదు.

బండివేగం బాగా తగ్గిపోయింది. వెంకడు బండిదిగి పొలాల్లోకి నడక ప్రారంభించేడు. బండి నిలబడిపోయింది. శేషయ్యగారు గోలచేస్తూ కట్లతోవున్న చేతులు చూపిస్తూ "దొంగ, దొంగ" పట్టుకోండి" అని వెంకడు వెళుతూన్నవేపు వేలుపెట్టి చూపించారు. బండిలోవున్న యిద్దరు ప్రయాణీకులు పరుగెత్తి వెంకణ్ణి తరిమి తరిమి పట్టుకుని తీసుకొచ్చారు.

బండిలో ప్రయాణీకులూ, రైలుగార్డూ అంతా శేషయ్యగారిమీద సానుభూతి చూపించేరు. శేషయ్యగారు అందరి గుండెలు కరిగిపోయేలాగ గుండెలు బాదుకున్నారు. "అయ్యో, కొత్త తోలుపెట్టండీ, అరవైరూపాయలిచ్చి కొన్నానండీ. ఈ దొంగవెధవ నన్ను చంపబోయాడండీ. వదలకండి, వెధవని పోలీసుల కప్పజెప్పండి" అని శేషయ్యగారు గోలపెట్టేరు.

"దొంగ వెధవా, పారిపోదామనుకున్నావా" అని ప్రయాణీకులు వెంకణ్ణి నాలుగు తాపులు తన్నేరు.

"ఈపెట్టె ఆడిదా ఏటి, అడగండి బాబూ అందులో ఏటుందో" అని వెంకడు ఏదో చెప్పబోయాడు.

"చూశారా, యీ దొంగవెధవ మాటలు! తన్నండి వెధవని" అని శేషయ్యగారు కళ్ళనీళ్ళు తుడుచుకున్నారు.

"తన్నండి వెధవని" అన్నారు ప్రయాణీకులు.

"కాళ్ళూ చేతులూ కట్టి బండిలో పడేయండి. వచ్చే స్టేషనులో పోలీసుల కప్పజెబుదాము" అన్నారు గార్డుగారు.

"ఈ వెధవ ఎన్నిసార్లు వెళ్ళేడో జైలుకి. వాడికి లక్ష్యమా ఏమిటి. నాలుగు తన్ని వదిలీండి" అన్నా రొకరిద్దరు ప్రయాణీకులు.

అందరూ తలో జెల్లా కొట్టేరు. ఎవ ఇష్టమొచ్చినట్టూ వాడు తన్నేడు. "ఫో. వెధవా, అదృష్టవంతుడివి బతికిపోయావు ఫో" అని వాడిని వదిలీశారు. బండి బయలుదేరింది.

శేషయ్యగారు ఒక నిట్టూర్పు వదిలారు. శని విరగడైంది: ఇంక తోలుపెట్టితీసి చూడవచ్చును. అయితే మరో రెండు స్టేషన్లు దాటితే రాయిపూరు వచ్చేస్తుంది. హాయిగా యింటికి వెళ్ళే చూసుకోవచ్చు ననుకున్నారు మళ్ళీ.

శేషయ్యగారు రాయిపూరు స్టేషన్లో దిగి సామాను గుర్రపు బండిలో వేసుకుని యింటికి వెళ్ళేరు.

శేషయ్యగారు విజయగర్వంతో యింట్లో అడుగుపెట్టేరు. సామాను దింపించి, బండివాడికి డబ్బులిచ్చి పంపించిన తరవాత తను తీసుకొచ్చిన పిప్పరమెంట్లు పిల్లలకిచ్చేరు. భార్య లోపలి గుమ్మందగ్గర నిలబడి భర్తవేపు చూస్తూంది. అమాయకురాలు ఆవిడకేం తెలుసు తను సాధించిన విజయం గురించి? తనతో యిన్నాళ్ళయి కాపరం చేస్తూందికాని ఆమెకు తన సామర్థ్యం గురించీ, తన వ్యవహారజ్ఞానం గురించీ ఏమీ తెలీదు. తన ప్రయోజకత్వాన్ని ఆమె గుర్తించలేదు. పాపం, చాల అమాయకురాలు. ఈ పెట్టెనుగురించి ఆమెతో ఏమని చెప్పాలి? ఏమని చెబితే ఆమె సంతోషిస్తుంది. నిజం చెబితే యిది తప్పు పనిగా భావించదుకద? ఇన్నాళ్ళయి కాపరం చేస్తున్నా తను భార్య మనస్తత్వాన్ని గురించి నిర్ణయించుకోలేకపోతున్నందుకు తినమట్టుకు తనకే విచారమేసింది శేషయ్యగారికి.

ఈ పెట్టెగురించి యిప్పుడామెతో చెప్పకూడదు. పెట్టె తాళాలు తీసి, అందులోని వస్తువులను ఆమెకు చూపించి ఆశ్చర్యం కలిగించాలి అనుకున్నారు శేషయ్యగారు. చాల ఆకలిగా వుందనీ, వంట వేగం కానీమనీ భార్యకు పురమాయించి తోలుపెట్టె తీసుకుని తన గదిలోకి వెళ్ళి గది తలుపులు మూసివేశారు శేషయ్యగారు.

తాళం కప్పలు చాలమంచివి. వాటిని విరగ్గొట్టి పాడుచెయ్యడమెందుకని తనదగ్గరవున్న తాళాలగుత్తి తెచ్చి అన్ని తాళాలతోనూ ప్రయత్నించి చూసేరు. కాని అవి లొంగలేదు. ఎవరో పాపం గట్టికప్పలే వేసుకున్నారు. వీటినింక బలవంతంగా విరగ్గొట్టడం తప్ప మరి మార్గాంతరం లేదు. డ్రాయరులోంచి పటకారు తీసి తోలుపెట్టె తాళాలు విరగ్గొట్టేరు.

ఆయన గుండెలు జోరుగా కొట్టుకుంటున్నాయి. చేతివేళ్ళు వణుకుతున్నాయి. పెట్టె తలుపు తీశారు. మీద తెల్లటి పంచపడతవుంది. ఏమిటి, ఎవరిదీ పెట్టె? తన కెలా వచ్చింది? తను చేసింది మంచిపనేనా? కాదు, ఇది దొంగపని. అయితే ఎందుకు చేశాడు. దీనిగురించి ఎందు కింత తాపత్రయపడ్డాడు? తనకీ వెంకడికీ ఏమిటి భేదం? నిజంగా వెంకడు నిజాయితీపరుడు. తన వృత్తి దొంగతన

మని స్పష్టంగా నిర్భయంగా చెప్పేడు. ఈ పెట్టె దొంగలించినట్టు ఒప్పుకున్నాడు. ఈ పెట్టెని దొంగిలించే హక్కు వాడికి లేకపోవచ్చును. అయితే వాడికిలేని హక్కు తనకుమాత్ర మెలా వచ్చింది? చివరికి అంతా వాడిని నిందించేరు, శిక్షించేరు. పాపం వెంకడికి తను అన్యాయం చేశాడు? అయితే లోకంలో పాపాలు చెయ్యనివా డెవడు? ఏమిటో పిచ్చి గాని! ఆలోచనలతో ఆయన బుర్ర బరువెక్కిపోయింది. మనసులో అశాంతి వ్యాపించింది. వాటిని వదిలించుకుని తేలికపడదామని ఆయన గట్టిగా ఒకసారి నవ్వి పెట్టెలో చెయ్యిపెట్టి ఆత్రంగా తడిమేరు. రెండో చేత్తో పెట్టెలో మీద నేవున్న పంచముడత తీసి పారేశారు.

శేషయ్యగారి ఒళ్లు ఝల్లుమంది. శరీరమంతా చెమటపట్టింది చూపలేక తువ్వాలుతో మొహం కప్పుకున్నారు.

లోపల బొద్దుకోయని పసిబిడ్డ దీర్ఘనిద్రలోవుంది. బిడ్డ శరీరం చల్లగా ఆయన చేతికి తగిలింది.

శేషయ్యగారి కళ్లు చీకట్లు కమ్మేయి. "పాపాత్ముణ్ణి క్షమించు తండ్రీ" అని ఒక కేక పెట్టేరు.

హరిణవిహారము

చిత్రకారుడు: శ్రీ ఎ. వి. యస్. ఆర్. జోస్యులు.